క్లుప్తంగా

ఘనంగా మహా పూర్ణాహుతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో శనివారం గణపతి హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవ్‌ప్రకాశ్ పాండే శ్రావణమాసం సందర్భంగా నెలరోజుల పాటు ప్రతీరోజు ఆలయంలో గణపతి హోమం చేసి చివరిరోజు మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి–లక్ష్మి దంపతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినియోగంలోకి మరుగుదొడ్లు



వినియోగంలోకి వచ్చిన మరుగుదొడ్లు

సాక్షి ఎఫెక్ట్..

జూలపల్లి: మండలంలోని కీచులాటపల్లెలో సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయని 'సాక్షి'లో ఐదురోజుల క్రితం కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఎంపీవో శేషయ్యసూరి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పంచాయతీ సిబ్బందితో మరుగుదొడ్ల ముందు పిచ్చిమొక్కలను శుభ్రం చేయించి, ట్యాంకులో నీటిని నింపారు. దీంతో సామాజిక మరుగుదొడ్లు ప్రజావసరాల కోసం వినియోగంలోకి తీసుకురావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కాల్వశ్రీరాంపూర్: పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీవో పూర్ణ చందర్‌రావు, ఎంపీవో అరిఫ్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంతోపాటు ఇదులాపూర్, మొట్లపల్లి గ్రామాల్లో శనివారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన పారిశుధ్య పనులను వారు పర్యవేక్షించారు. ఇదులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ముళ్లపొదలు తొలగించారు. గుంతల్లో మొరం పోసి చదును చేశారు. ఆయా గ్రామాల్లోని డ్రైనేజీల్లో సిల్టు తీయించారు. నిల్వ నీటి గుంతలను తొలగించి ఆయిల్‌బాల్స్ వేశారు.

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న వామపక్ష ప్రతినిధులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో బైరి వేణుమాధవ్‌కు అందజేశారు. జిల్లా నాయకులు ఆడెపు శంకర్, పెండ్యాల రమేశ్ మాట్లాడుతూ 14మాసాలుగా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేకపోవడంతో గ్రామాలల్లో సమస్యలు పేరుకుపోయి జవాబుదారీతనం కొరవడిందన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణ లోపించడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. అంతర్గాం మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూంలను నిరుపేదలకు అప్పగించాలని, గ్రామాల్లో తరచూ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జిల్లా నాయకులు కోడిపుంజుల లక్ష్మి, కట్ల తేజేశ్వర్, మార్త రాధ, తీగుట్ల రామయ్య, బండి అశోక్, కొట్టె తిరుపతి, చిలుక శంకర్, రాజేశ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన గజ్జెల సది ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మృతుని కుటుంబానికి పెద్దపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం సది తల్లికి రూ.4వేల నగదుతో పాటు బియ్యం, సరుకులు అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రాంకిషన్, సత్యనారాయణ, మహేందర్, వెంకటేశ్వర్లు, సాయిలు, కుమార్ పాల్గొన్నారు.

'పల్లెవెలుగు' చూడని బెస్తపల్లి

- ఏ ఊరికి వెళ్లాలన్నా.. రెండు కిలోమీటర్లు నడవాల్సిందే
- దశాబ్దాలుగా ఆర్టీసీ బస్సుకు నోచుకోని గ్రామం
- అత్యవసర పరిస్థితుల్లో తప్పని తిప్పలు



కాలినడకన వస్తున్న గ్రామ మహిళ

మంథనిరూరల్: దశాబ్దాలు మారినా ఇంకా ఆ గ్రామం పల్లెవెలుగు ముఖం చూడలేదు. ఒకప్పుడు అనుబంధ గ్రామంగా ఉన్న ఆ ఊరు ఐదేళ్ల క్రితం గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. అయినా ఇప్పటి వరకు ఆ ఊరు పల్లెవెలుగుకు నోచుకోలేదు. అదే మంథని మండలంలోని బెస్తపల్లి గ్రామం. ప్రభుత్వాలు, పాలకులు మారినా బెస్తపల్లి వాసులకు నడక కష్టాలు మాత్రం తప్పడం లేదు. మండలంలోని 34 గ్రామపంచాయతీల్లోని సుమారు అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ఇందులో బెస్తపల్లి మాత్రమే ఎర్ర బస్సు ఎరగదు. ఈ ఊరిలో సుమారు 600కు పైచిలుకు జనాభా కలదు.

ఎటు వెళ్లాలన్నా రెండు కి.మీ నడవాల్సిందే..

బెస్తపల్లి గ్రామం నుంచి ఏ ఊరికి వెళ్లాలన్నా రెండు కిలోమీటర్లు నడిచి చిల్లపల్లికి చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి బస్సులో వెళ్తుంటారు. గ్రామంలో సమయానికి ఆటోలు ఉంటే వాటిలో వస్తుంటారు. ఏమీ లేకపోతే గ్రామస్తులకు కాలినడకే శరణ్యం. నిత్యం వివిధ అవసరాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి మాత్రం నడక కష్టాలు తప్పడం లేదు.

మా ఊరికి బస్సులు రావు



నా చిన్నతనం నుంచి చూస్తున్నా ఒక్క బస్సు మా ఊరికి రాలేదు. ఏదైనా పెండ్లిళ్లకు వస్తే తప్ప మా ఊరికి బస్సులు రావు. ఏడికి పోవాలన్నా ఆటోలనో, కాలినడకనో పెద్ద రోడ్డు కాడికి పోయి బస్సుల్లో పోవాలె.

– తోకల పోచయ్య, బెస్తపల్లి

నడుచుకుంటనే పోతం



వేళకు ఆటోలు దొరక్కపోతే రోడ్డు దాకా నడుచుకుంటనే పోతం. రెండు కిలోమీటర్లకు ఆటోవాళ్లు పది రూపాయలు తీసుకుంటరు. అందుకనే నడుచుకుంటనే పోతం. అధికారులు మా ఊరికి బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటది.

– మేడి గంగమ్మ, బెస్తపల్లి

రూట్ సర్వే ప్రకారం బస్సు నడిపిస్తాం

రూట్ క్లియర్‌గా ఉండి, గ్రామ జనాభా ప్రకారం ప్రయాణికుల రాకపోకలు ఉంటే ఏ ఊరికైనా బస్ నడిపిస్తం. బెస్తపల్లి గ్రామానికి బస్సు కావాలని ఇప్పటి వరకు ఎవరూ విన్నవించలేదు. ఎవరైనా విన్నవిస్తే రూట్ సర్వే చేసి ఉన్నతాధికారులకు పంపించి అవకాశం ఉంటే బస్సు నడిపిస్తాం.

– శ్రావణ్‌కుమార్, డిపో మేనేజర్, మంథని



కమాన్‌పూర్: మండలంలోని మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలపై నిఘా కరువైంది. గతంలో రహదారిపై కమాన్‌పూర్ పోలీసులు కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్డు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారి, గుండారం బస్టాప్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో రోడ్డుపై ప్రమాదాలు జరిగితే ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించలేకపోతున్నారు. గతంలో పలు ప్రమాదాలకు కారణమైన వాహనాలను సీసీ పుటేజీలతో గుర్తించి పట్టుకున్న సంఘటలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు సీసీ కెమెరాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

పారిశుధ్యం మెరుగుపర్చాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కోల్‌సిటీ: రామగుండం నగరంలో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్య వ్యవస్థను మెగురుపర్చాలని సీపీఐ(ఎంఎల్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం బల్దియా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విలీనమైన గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా గాడితప్పిందని నాయకులు ఆరోపించారు. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించి పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం బల్దియా కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి తోకల రమేశ్, ఉమ్మడి జిల్లా కమిటీ నాయకులు ఈసంపల్లి రాజేందర్, పుల్లూరి నాగభూషణం, గూడూరి వైకుంఠం, కలువల రాయమల్లు, ఇనుగాల రాజేశ్వర్, చిలుక రాజు ఇరికిల్ల శ్రీనివాస్, ఊడిగమ్మ, స్వరూప, స్పందన, రమ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి




ర్యాలీలో ఉద్యమకారుల ఫోరం సభ్యులు

మంథని: ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర ఎంతో కీలకమైందని, ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. రామగిరి మండలం సెంటినరికాలనీలో శనివారం పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. సీఎంకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి పోస్టుకార్డులు పంపినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, ఉత్తర తెలంగాణ కన్వీనర్ బత్తుల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, మండల అధ్యక్షులు పరంకుశం శ్రీనివాస్‌చారి, మండల ఉపాధ్యక్షులు బూరుగు శంకర్‌గౌడ్ చందుపట్ల ప్రతాపరెడ్డి, బొంకూరి పోచం, నాగుల కృష్ణ పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఓదెల: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని బాలల పరిరక్షణ సోషల్ వర్కర్ వంగళ శ్యామల అన్నారు. ఓదెల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మిషన్ పరివర్తన, బాలల సంరక్షణ చట్టాలపై శనివారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో నో టు డ్రగ్స్ ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్, కౌన్సిలర్ వెంకటస్వామి, బోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో ఆధార్ అప్డేట్ సేవలు



పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణ చందర్‌రావు

కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆధార్ అప్డేట్ సేవలు ఎంపీడీవో పూర్ణ చందర్‌రావు ప్రారంభించారు. ఈనెల 25 వరకు కొనసాగే ఈ సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎంపీవో అరిఫ్ హుస్సేన్, సూపరింటెండెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ సేన లోగో ఆవిష్కరణ

రామగుండం: పట్టణంలోని ఈఎస్‌ఐ కాలనీ సమీపంలోని సీనియర్ సిటిజన్ హాల్ భవనం వద్ద ఉన్న వినాయక మండపానికి స్థానిక కాలనీవాసులు శుక్రవారం రాత్రి శ్రీరామ్‌సేన లోగో ఆవిష్కరించారు. దీనికి ఒక ల్యాండ్‌మార్క్ మాదిరిగా శ్రీరామ్ సేన లోగోను ఆవిష్కరించినట్లు స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఉస్మాన్ షరీఫ్ స్థానిక యువతను అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ పరిధి ఒకటో డివిజన్ పీకే రామయ్యకాలనీకి చెందిన తంగళ్లపల్లి సత్తయ్య(60) అనారోగ్యంతో హాస్పిటల్‌లో వైద్యం చేయించుకున్నారు. ఆర్థికంగా నష్టపోయి ఇబ్బంది పడుతున్న సత్తయ్య సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కాగా మంజూరైన రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదేశాలతో డివిజన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేశ్ బాధితుడి భార్య యశోదమ్మకు అందించారు.

సత్యాగ్రహ దీక్ష విజయవంతం చేయాలి

ఎలిగేడు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ 25న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేపట్టనున్న సత్యాగ్రహ దీక్ష విజయవంతం చేయాలని బీసీ సంఘం జిల్లా నియోజకవర్గ కన్వీనర్ బింగి రాజు కోరారు. ఎలిగేడులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సత్యాగ్రహ దీక్షకు బీసీ సోదరులు, నాయకులు తరలివచ్చి సత్తా చాటాలన్నారు.

రెండోరోజు కొనసాగిన ఎస్‌జీఎఫ్ క్రీడలు

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పాఠశాలల క్రీడా ఎంపిక పోటీలు రెండో రోజు శనివారం కొనసాగాయి. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథెటిక్స్ తదితర క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పీడీలు మహేందర్, శ్రీనివాస్, కవిత, నాగరాజు పర్యవేక్షించారు.

ఆర్టీవో ఆఫీసులో విజిలెన్స్ విచారణ

పెద్దపల్లిరూరల్: జిల్లా రవాణశాఖ అధికారి కార్యాలయంలో శనివారం విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన వాస్తవ, అవాస్తవాలపై ఆరా తీసినట్టు సమాచారం. గతంలో చేసిన లభ్యమైన డాకుమెంట్లకు సంబంధించిన వారిని పిలిపించి రూఢీ చేసుకున్నట్లు సమాచారం.

పండుగకు ముందే లాభాల వాటా చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: దసరా పండుగకు ముందే సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. సీఎండీ బలరాం, డైరెక్టర్(పా) గౌతం పొట్రూను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

నాణ్యమైన చేపపిల్లలు పంపిణీ చేయాలి

మంథని: మత్స్యశాఖ సమస్యలపై జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతికుమార్ హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని కలిశారు. నాణ్యమైన ఉచిత చేప పిల్లలను వెంటనే పంపిణీ చేయాలని కోరారు. మత్స్యకార్మికులకు నూతన పథకాలు వర్తింపజేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీసత్యసాయి గ్రామోత్సవం



సత్యసాయి భక్తుల నగర సంకీర్తన

జ్యోతినగర్: భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతవర్ష వేడుకల్లో భాగంగా రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో గోదావరిఖని శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. భజన, నగర సంకీర్తనలతో పాటు గ్రామస్తులకు ఆటల పోటీలు నిర్వహించారు. సమాజ సేవకులను సన్మానించారు. అనంతరం అన్నదానం చేశారు. జిల్లా సత్య సేవాసమితి అధ్యక్షుడు వెంకటస్వామి, మాజీ కార్పొరేటర్ పద్మలత, జిల్లా ఆధ్యాత్మిక విభాగం ప్రతినిధి రాజేశం, రాంబాబు, మల్లేశ్వరరావు, శంకరయ్య, డీసీసీ అధికార ప్రతినిధి వెంగల బాపు పాల్గొన్నారు.

సురవరం మరణం పార్టీకి తీరని లోటు

గోదావరిఖని: సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ అన్నారు. ఆయన మృతికి సంతాప సూచకంగా స్థానిక భాస్కర్‌రావుభవన్‌తో పాటు పలు ప్రాంతాలు, గ్రామాల్లో ఉన్న జెండాలను సగం వరకు కిందకు దించారు.

కార్మికుల హక్కుల సాధనకు ఎల్లవేళలా పోరాడతాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని: కార్మికుల ఆత్మ గౌరవం, హక్కుల సాధన, సంస్థ పరిరక్షణ కోసం ఎల్లవేళలా పోరాడే ఒకేఒక కార్మిక సంఘం హెచ్‌ఎంఎస్ మాత్రమే అని యూనియన్ అన్నారు. ఈనెల 30, 31వ తేదీల్లో జరగబోయే హెచ్‌ఎంఎస్ 26వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను యూనియన్ తిలక్‌నగర్ కార్యాలయంలో శనివారం విడుదల చేశారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర మహాసభలు శ్రీరాంపూర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతికుమార్, కొమురయ్య, దుర్గం శ్రీనివాస్, చందర్‌రావు, రామచందర్, సంపత్, రాజన్న, కుమార్, కిరణ్, జి.స్వామి, శ్రీధర్, మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్పిన్నింగ్, వీవింగ్ మిల్లుకు లిక్విడేటర్ నియామకం



మూతపడిన అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు

రామగుండం: ముప్పై ఏళ్ల క్రితం మూతపడిన అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులకు నూతనంగా లిక్విడేటర్‌ను నియమించినట్లు టెక్స్‌టైల్ శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 18న జీవో ఆర్టీ నంబర్ 139 పేరుతో టెక్స్‌టైల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. మూతపడిన మిల్లు ఆస్తుల పరిరక్షణ ఇతరత్రా అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్‌కు లిక్విడేటర్ హోదా కల్పించడం సహజం. కాగా 2021 నుంచి మిల్లుకు లిక్విడేటర్‌ను నియమించకపోవడంతో మిల్లు ఆస్తులు, మిల్లుకు సంబంధించి అన్యాక్రాంతమవుతున్న భూముల పరిరక్షణ విషయాలను బర్మా, కాందిశీకుల సంఘం అధ్యక్షుడు జెమ్ముల రామారావు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి మంత్రి శ్రీధర్‌బాబు, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చించారు. దీంతో వారు సానుకూలంగా స్పందించి జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను లిక్విడేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా లిక్విడేటర్ నియామకంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించడంపై బర్మా, శ్రీలంక, కాందిశీక కుటుంబాలు హర్షం వ్యక్తం చేశారు.

మహిళల రక్షణకు షీటీం నిరంతర నిఘా



అవగాహన కల్పిస్తున్న స్నేహలత

రామగిరి: మండలంలోని కల్వచర్ల ప్రగతి పాఠశాలలో శనివారం షీటీం అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం మెంబర్ స్నేహలత మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాల నియంత్రణ, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీటీం నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు బెదిరింపులకు గురైతే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న ఆలయ చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం చైర్మన్ చీకట్ల మొండయ్య, డైరెక్టర్లు కట్కూరి సమ్మిరెడ్డి, ఇరవేని రవిని మండలంలోని పొత్కపల్లిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు దబ్బెట మల్లేశం, యువజన సంఘం ఉపాధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, గుండ్ల సదానందం, మామిడాల రవీందర్, కుమార్, రవీందర్, కేదారి, ఇరుక్ల వీరేశం పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని కల్వచర్లలో శనివారం ఓదెల మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ చీకట్ల మొండయ్యను మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. రాజు, సదారెడ్డి, కనకయ్య, చంద్రమౌళి, సత్తయ్య పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై కేసు నమోదు చేస్తాం

సుల్తానాబాద్: ఎస్‌ఎంసీ అనుమతి లేకుండా వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేస్తామని టీజీఎంసీ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సుల్తానాబాద్‌లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా కె.మహేశ్‌కుమార్, రిజిస్ట్రార్ డా.లాలయ్యకుమార్ ఆదేశాల మేరకు పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డా.వి.నరేశ్ కుమార్, వైస్ చైర్మన్ డా.జి.శ్రీనివాస్ శనివారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ పేరుతో అనుమతి లేకుండా వైద్యసేవలు అందిస్తున్న వారిని గుర్తించినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా నకిలీ వైద్యుడు ప్రాక్టీస్ చేస్తూ కనిపించినట్లయితే వెంటనే స్థానిక అధికారులకు, టీజీఎంసీ 91543 82727 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

దోమల నివారణకు ద్రావణం పిచికారీ

సుల్తానాబాద్: దోమల నివారణకు కాలనీల్లో మలాథిన్ స్ప్రే చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు. శనివారం రాత్రి పలు కాలనీల్లో మలాథిన్ స్ప్రే ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి చుట్టుపక్కలా పరిశుభ్రత పాటించాలని కోరారు.

ఆదర్శ విద్యాలయంలో ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులో ఉన్న మోడల్ (ఆదర్శ) విద్యాలయంలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. వేడుకల్లో సీనియర్, జూనియర్ విద్యార్థులు సంయుక్తంగా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ పంబాల సదానందం యాదవ్ మాట్లాడారు. విద్యార్థుల మధ్య స్నేహభావం, చదువు, క్రీడల్లో పోటీతత్వం పెంచుకోవడంపై వచ్చే ఫలితాలతోనే విద్యాలయానికి మంచి పేరు ప్రతిష్టలు వస్తాయన్నారు. వేడుకల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.